ప్రజాశక్తి
మంగళవారం 22 ఏప్రిల్ 2025
5
శ్రీ సత్యసాయి

సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ టి.చేతన్

ఆగని భూపందేరం..!

- సోలార్ పేరుతో 'కార్పొరేట్'కు భూములు
- రెవెన్యూ విక్రాంత్ సంస్థకు అప్పగిస్తూ నిర్ణయం
- గుత్తి-పామిడి మధ్య కేటాయింపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో సోలార్ కంపెనీలకు భూ కేటాయింపుల పందేరం ఆగటం లేదు. వేల ఎకరాలు భూకేటాయింపులు కార్పొరేట్ కంపెనీలకు కేటాయిస్తూనే పోతున్నారు. ఇప్పటికే వేల ఎకరాలు భూకేటాయింపులు సోలార్ కోసం ఇచ్చారు. తాజాగా మరో కంపెనీకి వేలాది ఎకరాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెవెన్యూ విక్రాంత్ సంస్థకు పెద్ద ఎత్తున అనుమతులను ఇచ్చారు.

గుత్తి-పామిడి మధ్య కేటాయింపు

జిల్లాలోని గుత్తి-పామిడి మధ్య ఈ ప్రాజెక్టు మంజూరైంది. 540 మెగావాట్లు ఎసి / 753 మెగావాట్లు డిసి సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు ఆమోదం ఇచ్చారు. గుత్తి-పామిడి మండలాల పరిధిలోని ఊటకల్లు, ఊబిచర్ల, బేతాపల్లి, మామదూరు, ఇడుగూరు గ్రామాల పరిధిలో సోలార్ ప్రాజెక్ట్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. ఈ గ్రామాల పరిధిలో సోలార్ పవర్ ప్రాజెక్ట్ రానుంది. దీనికి నిర్దిష్టంగా కేటాయింపులు ఎంత అన్నది నిర్ణయించలేదు. లీజు పద్ధతిలో భూములను కంపెనీయే సేకరించినందుకు అనుమతులు ఇచ్చారు. ఏడాదికి 31 వేల చొప్పున లీజు ఉండే విధంగా నిర్ణయించారు. రెండు సంవత్సరాలకు ఒకసారి ఐదు శాతం లీజు పెంచాలని పెంచాలని ఉత్తర్వులు పేర్కొనడం జరిగింది.

ఇప్పటికే పెద్ద ఎత్తున అనుమతులు

సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అనుమతులు ఇచ్చి వేల ఎకరాలు ఇందుకోసం కేటాయించారు. ఇంతపెద్ద ఎత్తున భూమిని ఒకే జిల్లాలో కేటాయిస్తుండడంపై విపక్షాల నుంచి పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాబోయే రోజుల్లో జిల్లాలో వ్యవసాయానికి సాగుభూమి కూడా కరువే పరిస్థితులు నెలకునే అవకాశం ఉందని ఆందోళన ను వ్యక్తం చేస్తున్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో పిజిఆర్ఎస్ కార్యక్రమం అనంతరం ఉల్లాస్ కార్యక్రమం కింద జిల్లా స్థాయి కమిటీ కన్వర్జెన్స్ సంబంధించిన పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం కింద స్వయం సహాయక బృందం, ఇతరుల సహకారంతో అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతపై దృష్టి సారించే చర్యలు తీసుకోవాలన్నారు. ద్వాక్రా సంఘాల్లో కొన్ని చోట్ల మహిళలు సంతకం పెట్టడం లేదని, వారితో సంతకాలు చేయించేలా నేర్పించాలన్నారు. ఉల్లాస్ కార్యక్రమం కింద ఈనెల 16వ తేదీ నుంచి ఆరు రోజులపాటు ఇంటింటి సర్వే మొదలు పెట్టి, నిరక్షరాస్యులను గుర్తించాలన్నారు. మే 5 నుంచి సెప్టెంబర్ వరకు అక్షరాస్యత నేర్పించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయ సారథి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, డిఆర్డిఎ పీడీ నరసయ్య, అడల్ట్ ఎడ్యుకేషన్ డిడి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 604 యూనిట్లు

2025–26 ఆర్థిక సంవత్సరానికి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ లబ్ధిదారులకు 604 యూనిట్లు పంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో ప్రత్యేక డిసిసి (కరువు, ఎస్సీ రుణాలు)పై బ్యాంక్ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 604 యూనిట్లకు సంబంధించి అర్హులైన ఎస్సీ లబ్ధిదారుల ఎంపిక చేయాలని ఆదేశించారు. తనకల్లు, రొద్దం మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం జరిగిందని రుణాలను రీషెడ్యూల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్డిఎం రమణ కుమార్, డీడీ నర్సయ్య, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ టిఎస్.చేతన్

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని పరిష్కరించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, డిఆర్డిఎ పీడీ నరసయ్యతో కలిసి ప్రజల నుంచి 304 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చే ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు నెలవారీ కార్యాచరణ ప్రణాళికలను పూర్తి స్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు పాఠశాల శాఖ విద్యా ఆధ్వర్యంలోఈ నెల 23వ తేదీలోపు నమోదు డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి, 5 సంవత్సరాల వయస్సు గల పిల్లలను పాఠశాలల్లో చేర్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని పులమతి జడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న వృత్తి విద్య విద్యార్థులు ఇంటర్న్షిప్లో భాగంగా హెచ్ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో హిందూపురం పట్టణంలోని సూపర్ మార్ట్ ను సందర్శించారు. ఇంటర్న్షిప్ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులకు సోమవారం హెచ్ఎం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఆ ప్రోగ్రాంలో విద్యార్థులకు రిటైల్ అండ్ హోల్సేల్ గురించి అవగాహన కల్పించి నట్లు వృత్తి విద్య టీచర్ తెలిపారు. ఇంటర్న్షిప్లో భాగంగా విద్యార్థులు 10 రోజుల పాటు వివిధ మార్ట్లను సందర్శించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న 2008 డీఎస్సీ ఉపాధ్యాయుల నియామక తేదీని అందరికీ ఒకేలా ఉండేటట్లు చూడాలని ఎస్టియు నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఇఒ కిష్టప్పకు అందజేశారు. 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు నియామక పత్రాలను 2010 నవంబర్ ఆరో తేదీన ఇచ్చారన్నారు. అయితే జిల్లావ్యాప్తంగా కొంతమంది మండల విద్యాశాఖాధికారులు కొందరిఉపాధ్యాయులకు 2010 నవంబర్ 4,5,8 తేదీలను జాయినింగ్ డేట్ ఇవ్వడంతో బదిలీ సీనియారిటీలో మెరిట్ ఉపాధ్యాయులకు నష్టం జరుగుతోందని చెప్పారు. 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు కామన్ జాయినింగ్ తేదీని ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరి ప్రసాద్ రెడ్డి, కోనంకి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి రవిచంద్ర. వెంగమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు పూరిగుడిసె దగ్ధం

ప్రజాశక్తి-పెనుకొండ

మండలంలోని దుద్దేబండ గ్రామంలో ఆదివారం రాత్రి భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగుపడడంతో గ్రామ సమీపంలోని పొలం వద్ద నివాసం ఉంటు న్న పెద్దనారాయణప్పకు చెందిన గుడిసె దగ్ధమైంది. ఈ సంఘటనలో బీరువాలో ఉంచిన రూ. 1.08 లక్షల నగదు, 3 తులాల బంగారు నగలు, భూముల పత్రాలు, నిత్యావసర సరుకులు, దుస్తులు, సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయని బాధితుడు నారాయణప్ప ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో తాను గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇంటి వద్దకు వెళ్లడంతో ప్రాణాపాయం తప్పిందని తెలిపాడు. విషయం తెలుసుకున్న తహాశీల్దార్ శ్రీధర్ సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్తి నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని, ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంత్రి సవిత సాయమందించారు. ట్రస్ట్ డైరెక్టర్లు నాగార్జున, రామాంజనేయులు, బాబుల్రెడ్డి బాధితులకు నిత్యావసర సరుకులు, రూ. 10 వేల నగదు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని మంత్రి చెప్పినట్లు తెలిపారు. బాధితులను నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, గుట్టూరు సూర్యనారాయణ, పోతిరెడ్డి, రామ కృష్ణ పరామర్శించారు.

బాధితులకు సరుకులు, ఆర్థికసాయం అందిస్తున్న ట్రస్ట్ డైరెక్టర్లు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు

పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్చండి : హెచ్ఎం

ప్రజాశక్తి-మడకశిర రూరల్

ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్చాలని మండలం పాపసానపల్లి పాఠశాల హెచ్ఎం రామకృష్ణ కోరారు. మెలవాయి ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు 9వ తరగతికి తమ పాఠశాలలో చేరాలని కోరారు. అలాగే ఆయన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను వివరించారు. అనంతరం దిగువ గుండుమల, కోడిగానిపల్లి, కంబాలపల్లి, ఉగ్రేపల్లి గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఎం.నాగరాజు, సురేష్, చింతా నాగరాజు, వెంకటేష్, వాణికుమారి, కైరున్బి, హరిప్రసాద్ ఉన్నారు.

మెగా డీఎస్సీ నిరుద్యోగులకు వరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

ఎన్నికల హామీ మేరకు సిఎం చంద్రబాబు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి మాట నిలబెట్టుకు న్నారని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. పట్టణంలోని ఆర్అండ్బి విశ్రాంతి భవనంలో సోమవారం వారు డీఎస్సీ అభ్యర్థులతో కలిసి సిఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం పది నెలల్లోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులకు గొప్ప వరం అన్నారు. అనంతరం 9 మంది లబ్ధిదారులకు రూ. 4.05 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్మూర్తి, విఎం.పాండురంగప్ప, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బిఎస్ గురుమూర్తి, కన్వీనర్లు లక్ష్మీనారాయణ, మద్దనకుంటప్ప, దాసిరెడ్డి, కుమారస్వామి, గణేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం ఎమ్మెల్యే రాజు, డీఎస్సీ అభ్యర్థులు

పరిశుభ్రతపై కౌన్సిలర్లతో సమావేశం

కౌన్సిలర్లు పట్టణ పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశించారు. వారు ఆర్అండ్బి విశ్రాంతి భవనంలో కౌన్సిలర్లతో సమావేశం నిర్వహిం చారు. పట్టణంలో రోడ్లపై, డ్రెయినేజీ కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని శుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామ దేవత కనుమ మారెమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు.

దళిత భూములను మినహాయించాలి

మండలంలోని గౌడనహళ్లి పంచాయతీ జమ్మానిపల్లి గ్రామంలో పరిశ్రమల కోసం చేపట్టిన భూసేకరణలో దళిత రైతుల భూములను మినహాయించాలని కోరుతూ ఆ ప్రాంత రైతులు ఎమ్మెల్యే రాజుకి వినతి పత్రం సమర్పించారు. రైతులు మాట్లాడుతూ ఉన్న కొద్ది భూమిని కోల్పోతే జీవనోపాధి కోల్పోయి రోడ్డు పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొంకల్లు కృష్ణమూర్తి, కన్నా, రైతులు నరసింహప్ప, గంగాధరప్ప, తిప్పన్న, గంగప్ప, జెఎస్ నరసింహప్ప, మురళిబాబు, రవి పాల్గొన్నారు.

వర్షానికి పంట నేలపాలు

గాలివాన ధాటికి నేలరాలిన మామిడికాయలు

ప్రజాశక్తి - గాండ్లపెంట

అకాల వర్షాలతో మండలంలో పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి మండల పరిధిలోని కమతంపల్లి, కటారుపల్లి, గజ్జలవాండ్రపల్లి తదితర గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. కమతంపల్లికి చెందిన సబ్జాన్ అనే వ్యాపారి లీజుకు తీసుకున్న 12 ఎకరాలు మామిడి తోటలోని చెట్లు విరిగిపోయాయి. గజ్జలవాండ్లపల్లి చెందిన రైతు కృష్ణారెడ్డి సాగు చేసిన మూడున్నర ఎకరా మామిడి తోటలో కాయలు రాలిపోయాయి. అరటి తోటలోని చెట్లు విరిగిపో యాయి. కటారుపల్లికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి రెండు ఎకరాల్లో సాగు చేస్తున్న కనకాంబరాల తోట పూర్తిగా దెబ్బతింది. పంటనష్టంతో లక్షల రూపాయలు నష్టపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

జిల్లాలో 471.8 మిల్లీమీటర్ల వర్షం

పుట్టపర్తి అర్బన్ : జిల్లావ్యాప్తంగా ఆదివారం రాత్రి ఉరుములు మెరుపులు ఈదురు గాలులతో వర్షం కురిసింది. రెవెన్యూ అధికారుల నివేదిక ప్రకారం జిల్లా లో ఐదు మండలాలు మినహా మిగిలిన 27 మండలాల్లో ఒక మోస్తారు వర్షం కురిసింది. అత్యధికంగా చెన్నేకొత్తపల్లి మండలంలో 54.4 మిల్లీమీటర్లు, రామగిరిలో 51.6, కదిరి 49 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. మిగతా మండలాల్లో కొద్దిపాటి వర్షపాతం నమోదు అయింది. తాడిమర్రి మండలంలో అతి తక్కువగా 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. కొత్తచెరువు మండలంలోని తలమర్ల గ్రామంలో కొబ్బరి చెట్టు మీద పిడుగు పడింది. అయితే దానివల్ల ఎవరికీ ప్రమాదం జరగలేదు. అలాగే పలుచోట్ల వరి పంట నేలకొరిగింది. మామిడి పంటలకు కూడా పంట నష్టం జరిగింది.

'తల్లికి వందనం' అమలు చేయాలి : ఎస్ఎఫ్ఐ

హిందూపురం : అర్హత కలిగిన విద్యార్థులందరికీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఈరేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉప తహాశీల్దార్ మైనుద్దీన్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఈరేష్, పట్టణ కన్వీనర్ అఫ్రిద్ మాట్లాడుతూ, ఇప్పటికే విద్యా సంవత్సరం పూర్తయిన రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కో కన్వీనర్ అజ్మల్, కమిటీ సభ్యులు మిఫుజ్, ఇస్మాయిల్, బిలాల్, సైపుల్లా పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

రోజు రోజుకి దెబ్బతింటున్న పర్యావరణాన్ని కాపాడుకునేందుకు అందరూ ఐక్యంగా కషి చేయాలని జెవివి నాయకులు పేర్కొన్నారు. సోమవారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని సంతేబిదనూరు పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడమే ఉపశమని అన్నారు. పచ్చదనం పెంపొందించడం వల్ల సకాలంలో వర్షాలు పడి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండవచ్చన్నారు. మొక్కల పెంపకం ఒక అలవాటుగా మార్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలగంగాధర్ నాయక్, జాబేజ్, రాజశేఖర్ రెడ్డి, అనూరాధ, నరసింహమూర్తి, ఉపాధ్యాయులు అశ్వర్థప్ప, చంద్రశేఖర్ రెడ్డి, రవికుమార్, శ్రావణి, విద్యా కమిటీ ఛైర్మన్ హిదయతుల్లా, హరి తదితరులు పాల్గొన్నారు.

జానపద కళాకారిణికి ఉగాది పురస్కారం

ధర్మవరం రూరల్: ధర్మవరం పట్టణానికి చెందిన ప్రముఖ జానపద గాయకురాలు సోమిశెట్టి సరళకు 2025 సంవత్సరానికి జాతీయ స్థాయిలో ఉగాది పురస్కారం ప్రకటించారు. ఈ సందర్భంగా సరళ మాట్లాడుతూ తిరుపతి సిటీ ఛాంబర్ వారు తమ 28వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాలలోని విశిష్ట సేవలను అందించిన వారికి 2025 సంవత్సరానికి గాను ఉగాది పురస్కారాలు ప్రకటించడం జరిగిందన్నారు. ఈ పురస్కారాలలో కళా రంగానికి చెందిన తాను ఎంపిక కావటం ఆనందంగా ఉందన్నారు. ఈనెల 27వ తేదీ తితిదే సౌజన్యంతో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో జరగబోవు వేడుకల్లో తాను ఈ పురస్కారం అందుకోనున్నట్లు చెప్పారు. ఇందుకు గాను తనకు ఆహ్వానం కూడా అందినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు

ధర్మవరం రూరల్ : గుంతకల్లు రైల్వే క్రీడమైదానంలో జరిగిన 12వ రాష్ట్ర స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలలో ధర్మవరం ఆర్డిటి క్రీడా మైదానంలో కబడ్డీ లో శిక్షణ పొందుతున్న క్రీడాకారుల్లో ముగ్గురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కబడ్డీ కోచ్ పృథ్వీ తెలిపారు. ఎన్.ఉష, బి.నవ్య, పి..శ్రీనివాసులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. వీరు మే నెల 2 నుంచి 5 వరకు కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఆర్డిటి ఎటిఎల్ శ్రీనివాసులు, ఆర్డీటీ కోచ్ పృథ్వీ ప్రతిభా క్రీడాకారులను అభినందించారు.

నీటి సమస్యపై క్షేత్రస్థాయిలో పర్యటించాలి

మున్సిపల్ ఛైర్మన్ డిఇ రమేష్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం



సిబ్బందితో సమీక్షిస్తున్న ఛైర్మన్, కమిషనర్

నీటి సమస్య పరిష్కారానికి అధికారులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రస్తుత వేసవిలో ప్రజల నుండి నీటి సమస్యపై ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలని సూచించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ లో నీటి సమస్య, పన్నుల వసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్ మాట్లాడుతూ వేసవి కాలంలో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు లీకేజీలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జి డిఇఇ ఆనంద్ రాజు, ఏఈలు జనార్ధన్, ధీరజ్, సచివాలయ అడ్మిన్, అమ్యూనిటీ కార్యదర్శులు, ఫిట్టర్లు, వాటర్మ్యాన్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు మృతి

కావ్యదీప (ఫైల్‌ఫొటో)

రొద్దం : స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల లో పనిచేస్తున్న పెనుకొండకు చెందిన హిందీ ఉపాధ్యా యురాలు కావ్యదీప(24) ఆదివారం ఉన్నఫళంగా జ్వరం బారిన పడింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని సవేరా ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకొన్న ప్రిన్సిపల్ అనిత, తోటి ఉపాధ్యాయులు సోమవారం కావ్యదీప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్డిటి సంస్థకు ఆర్థికసాయం

అగళి : ఆర్డిటి ఆధ్వర్యంలో సోమవారం అగళితో చుట్టుపక్కల గ్రామాల్లో 'స్పందించు–సాయమందిం చు' కార్యక్రమం చేపట్టారు. వీరికి అగళి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ. 8500ను ఆర్డిటి కోర్డినేటర్ ఓబులేసుకు అందజేశారు. హెచ్ఎం శివయ్య, కోఆర్డినేటర్ ఓబులేసు మాట్లాడుతూ ఇలా సేకరించిన సొమ్ముతో తల్లిదండ్రులు లేని పిల్లలను చేరదీసి వారికి చదువుతో పాటు పోషణ బాధ్యత తీసుకుంటామన్నారు. కష్టాల్లో బాలబలికలను, గుర్తించి ఆర్డిటి దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, ఆర్డిటి సిబ్బంది పాల్గొన్నారు.

24న కలెక్టరేట్ వద్ద ధర్నా

సోమందేపల్లి : కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీ కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) జిల్లా నాయకులు కంబాలప్ప రవి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక వాల్మీకి సర్కిల్లో భవనం, ఇతర నిర్మాణ కార్మికులతో కలిసి కరపత్రాలు ఆవిష్క రించారు. నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు మాట్లాడుతూ పది నెలలైనా కూటమి ప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. కార్యక్రమంలో ఆదిరెడ్డి, నారాయ ణప్ప, నాగరాజు, భాగ్యమ్మ, సరస్వతమ్మ, సాకమ్మ పాల్గొన్నారు.

మాజీ ఎంపిటిసి మృతికి నివాళి

రొద్దం : మండలంలోని నల్లూరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపిటిసి శ్రీరామప్ప అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న మంత్రి సవిత మండల నాయకులతో కలిసి ఆ గ్రామం వెళ్లి శ్రీరామప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అలాగే ఎంపి బికె.పార్థసారథి సతీమణి బికె.కమలమ్మ శ్రీరామప్ప మృతదేహానికి పూలమాల వేసి టిడిపి జెండా కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో సుబ్బరత్నమ్మ, నరసింహులు, మాధవనాయుడు, మండల కన్వీనర్ నరహరి, చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, వీరాంజి, డీలర్ల సంఘం అధ్యక్షులు సిద్దన్న, డీలర్ మూర్తి, నాగరాజు, చలపతి, సత్యశేఖర్ ఉన్నారు.

శ్రీరామప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మంత్రి సవిత

క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

క్షతగాత్రుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని మోటు చింత మానుతండాకు చెందిన భూక్య తులసే నాయక్ ఆదివారం కొక్కంటి క్రాస్‌లో జరిగి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి కాలు విరిగింది. ఈ విషయాన్ని నాయకుల ద్వారా తెలుసుకున్న కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ సోమవారం కదిరి త్రివేణి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తులసే నాయక్‌ను పరామర్శించారు. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ. 50వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తనకల్లు మండల మాజీ కన్వీనర్ బీగం శంకర్ నాయుడు, సర్పంచి ఉత్తన్న నాయక్, తెలుగు యువత అధ్యక్షులు కావడి ప్రవీణ్ కుమార్, మండల ఎస్‌టి సెల్ శంకర్ నాయక్, ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది బాబ్జాన్, నాయకులు మూడే బాలాజీ నాయక్, మహేష్ నాయక్, భూక్య వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి బత్తలపల్లి

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల లోని భవితా కేంద్రం వికలాంగ విద్యార్థులకు ఉపకరణాలను సోమవారం పంపిణీ చేశారు. 5 రొలేటర్లు, 3 వీల్ చైర్లు, 3 సిపి స్పెషల్ వీల్ చైర్లు, 3 ఎంఆర్ కిట్లు అందజేశారు. మండల విద్యాశాఖాధికారి సుధాకర్ నాయక్, స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌పిలు ఖాదిరెడ్డి, ప్రసాద్ , చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి -పుట్టపర్తి రూరల్

పౌష్టికాహారం, అసంక్రమిత వ్యాధులు వడదెబ్బ పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు నిర్వహించారు. పుట్టపర్తి పరిధిలోని నిడిమామిడి గ్రామంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్ అధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాలు శుభ్రత పాటించి, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సుస్మిత, ఆశా కార్యకర్తలు నిర్మల, మమతాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పురపాలక సంఘం పరిధిలో మంగళవారం నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ వీరేష్ తెలిపారు. పట్టణంలోని కదిరి గేటు వద్ద పంపింగ్ లైన్ మరమ్మతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. మరమ్మతు పూర్తి అయ్యేంతవరకు నీటి సరఫరా పట్టణంలో ఉండదని తెలిపారు. కావున పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

విద్యుత్ లోక్ అదాలత్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని బత్తలపల్లి రోడ్ మార్కెట్ యార్డ్ విద్యుత్ సబ్ స్టేషన్ లో సోమవారం నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు విశేష స్పందన వచ్చిందనిపుట్టపర్తి ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఓ. శివరాములు తెలిపారు. ఈ ప్రత్యేక విద్యుత్ అదాలత్ కు రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు అంజనీ కుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి హాజరై వినియోగదారుల సమస్యల పరిష్కరించారన్నారు. మొత్తం 28 ఫిర్యాదులు రాగా, అందులో ఐదు ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో ఏడిఈ- లక్ష్మీనరసింహారెడ్డి, ఏవో రామస్వామి, ఏఏవో రామకృష్ణ, ఏఈలు నాగభూషణం, కొండారెడ్డి, జానకి రామయ్య, శివయ్య, రవి తో పాటు 50 మంది వినియోగదారులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని శెట్టిపల్లి అంగన్వాడి కేంద్రంలో సోమవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఒ శాంతి ఆదేశాల మేరకు సూపర్వైజర్ సునీత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏప్రిల్ 8 నుండి 22 వరకు కేంద్ర, రాష్ట్ర మహిళాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వెయ్యి రోజుల పోషణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం జానకి, ఎమ్మెస్‌కే సుజాత, నాగమణి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తాడిమర్రి :మండల పరిధిలో పుల్లా నారాయణ పల్లి అంగన్వాడి కేంద్రంలో సిడిపిఒ సరస్వతి, సూపర్‌వైజర్ లలితమ్మ అధ్యక్షతన పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రోజువారి వ్యాయామం ప్రాముఖ్యతను వారు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ అధికారిణి

హామీ మేరకు ఇళ్లస్థలాలివ్వాలి : సిపిఎం

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

గతంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్. నరసింహులు డిమాండ్ చేశారు. కదిరి రూరల్ కుమ్మరవాండ్లపల్లి పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని కోరుతూ డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వర్‌కి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో అర్హులైన నిరుపేదలందరికీ గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు,పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు మంజూరు చేసి పక్కాగృహాలు నిర్మించి ఇస్తామనిచంద్రబాబు నాయుడు చెప్పారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్న ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. వేల రూపాయలు అద్దెలు కట్టలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం మొండి వైఖరికి నిరసనగా సిపిఎం జిల్లా కమిటీ ఈనెల 26వ తేదీన అన్ని తహశీల్దార్ కార్యాలయాల ఎదుట రిలే దీక్షలకు పిలుపునిచ్చిందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాంబశివ, రాంమోహన్, ముస్తాక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ మాత్రమే కట్టించుకుని రుణాలు రెన్యువల్ చేయాలి

బ్యాంకు ఎదుట ధర్నాలో ఎపిరైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి - తనకల్లు

పంటరుణాల రెన్యువల్‌లో బ్యాంకు అధికారులు అవలంభిస్తున్న విధానాలకు నిరసనగా ఎపి రైతుసంఘం, వామపక్షాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత కరువు పరిస్థితుల్లో పంటరుణాల రెన్యువల్‌లో బ్యాంకు అధికారులు అవలంభిస్తున్న వైఖరి సరికాదన్నారు. అసలు, వడ్డీ కడితేనే రుణాలు రెన్యువల్ చేస్తామని చెప్పడం అన్యాయమన్నారు. కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకుని రుణాలు రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా బ్యాంకుల వద్ద నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం శివన్న, జిల్లా కమిటీ సభ్యులు వివి, రమణ, ఎస్వీ రమణ, చలపతి, శ్రీనివాసులు, సిఐటియు నాయకులు ఒంటెద్దు వేమన్న, సిపిఐ మండల కార్యదర్శి రెడ్డప్ప, రైతు సంఘం నాగేంద్ర, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

నిందితులు తరచూ న్యాయవాదులను సంప్రదించాలి

జిల్లా న్యాయాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్

ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి-హిందూపురం

కేసుల వివరాలను తెలుసుకొనేందుకు ఉపకారాగారంలో ఉన్న నిందితులు తరచూ న్యాయవాదులను సంప్రదించుకునే అవకాశం ఉందని జిల్లా న్యాయ అధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ తెలిపారు. సోమవారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపకారాగారంలో నిందితులకు అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపకారాగారంలో అధికారులు, సిబ్బంది కుల వివక్ష ప్రదర్శిస్తుంటే తెలియజేయాలని, జైళ్లలో కుల వివక్షకు తావు లేదని అన్నారు. ఇఅర్హత ఉన్న నిందితులు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని శివప్రసాద్ యాదవ్ తెలిపారు. ఇందులో భాగంగా ఇరువురు నిందితులు వైద్య పరంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే మెరుగైన చికిత్సలు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఉపకారాగార అధికారి హనుమప్పకు సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కళావతి, సంతోషి కుమారి, మురళి, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

నల్లమాడ మండలం రెడ్డిపల్లిలో ఉపాధి హామీ పనులు కల్పించాలని కూలీలు కోరారు. ఈ మేరకు వారు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ పనికి రాకపోయినా తనకు బిల్లులు చెల్లించాలంటూ అదే గ్రామానికి చెందిన పురుషోత్తం అనే వ్యక్తి నిత్యం అధికారుల చుట్టూ తిరుగుతూ 350 మంది ఉపాధి హామీ కూలీలకు పని లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఆయన చేసే పని వల్ల తమకు పనులు లేకుండా పోతున్నాయని వాపోయారు. కూలీలందరం పనులకు వెళ్తుంటే పురుషోత్తం మాత్రం పనికిరాకుండా బిల్లులు చెల్లించాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. దీంతో ఉపాధి సిబ్బంది ఎవరూ గ్రామంలోకి వచ్చి పనులు కల్పించే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగాయని ఆయన అధికారులకు ఫిర్యాదు చేస్తుండడం వల్ల కూలీలు నష్టపోతున్నట్లు వాపోయారు. గ్రామంలోని 350 మంది కూలీలతో సమానంగా ఆయన కూడా పనికి వస్తే ఏ ఇబ్బంది లేదని, అలాకాకుండా పనులకు రాకపోయినా బిల్లులు చెల్లించాలని ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. వారానికి ఒక అధికారి దగ్గరకు వెళ్లి గ్రామంలో పనులు లేకుండా చేస్తూ తమ పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి ఉపాధి హామీ పనులు కల్పించి కూలీలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 40 మంది కూలీలు పాల్గొన్నారు.

తమ సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు

హిందూపురం వాసికి గిన్నిస్ బుక్‌లో చోటు

పి.ఇమ్మానుయేల్ రాజ్ ను అభినందిస్తున్న చర్చి ప్రతినిధులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని సి అండ్ ఐ జి మిషన్ చర్చ్, మిషన్ కాంపౌండ్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ పి.స్టీఫెన్ రాజ్ కుమారుడు పి.ఇమ్మానుయేల్ రాజ్ కు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. ఆయన 2024 సంవత్సరం డిసెంబర్ 1వ తేదీన హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు కొరకు 1046 మంది సంగీత కళాకారులు ఒక గంటలోనే కీబోర్డు వాయించి ఇన్‌స్టాగ్రామ్ లో అప్లోడ్ చేసి విజయం సాధించారు. ఇటీవల హైదరాబాద్ లో జరిగిన బహుమతుల ప్రధానోత్సవం లో ఇమ్మానుయేల్ రాజుకు ఈ సర్టిఫికెట్, గోల్డ్ మెడల్ బహుకరించారు. ఈ సందర్భంగా సీ అండ్ ఐ జి మిషన్ చర్చ్ మిషన్ కాంపౌండ్ లో ఏర్పాటు చేసిన అభినందన సభలో సంఘ కార్యదర్శి డాక్టర్ ఏ. నాగేంద్ర కుమార్, కోశాధికారి జె.సాల్మన్ రాజ్, సంయుక్త కార్యదర్శి అరుణ్ కుమార్, దేవరాజ్, డీకన్ బోర్డు సభ్యులు ఆంజనేయులు, రూబేన్ పాల్, జార్జి బాబు తదితరులు పాల్గొని భవిష్యత్తులో మరిన్ని రివార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

వక్ఫ్‌చట్ట సవరణను రద్దు చేయాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

నూతన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ముస్లిం కమిటీ నాయకులు హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు పట్టణంలో సోమవారం పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించారు. ఆయుబ్ ఖాన్ అధ్యక్షతన ధర్మవరం జామియా మసీదు, మదీనా మసీదు, అంజుమాన్ కమిటీల ఆధ్వర్యంలో, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాల మేరకు ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. హిందువులు క్రిస్టియన్ సోదరుల మద్దతుతో గత తొమ్మిది రోజుల రిలే నిరాహార దీక్షలు అనంతరం ఈ ర్యాలీని నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం ఆర్డీవో మహేష్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, షేకు మోషేజ్, గ్రేస్,య్యా, సుందర్ సింగ్, మౌలానా అబుతాహీర్, తయోబ్, అభూతురాబ్, సిపిఎం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, సిపిఐ నాయకులు మధు, వైసిపి నాయకులు చౌడప్ప, సిఐటియు రమణ, ఎఐటియుసి, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

'నారాయణ పాఠశాల గుర్తింపు రద్దుచేయాలి'

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా గోరంట్ల పట్టణంలోని నారాయణ పాఠశాల గుర్తింపును రద్దు చేసి పాఠశాలను సీజ్ చేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆధ్వర్యంలో సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల ,నరేంద్ర తదితరులు మాట్లాడుతూ ఆ స్కూల్ ప్రిన్సిపల్ స్థాయిలో ఉన్న వ్యక్తి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ మానసికంగా, లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆయనపై కేసు కూడా నమోదుయిందని అన్నారు. ఈ నేపథ్యంలో ఆ పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు. రమేష్ , శివ , వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దానిమ్మ మొక్కలు నరికివేత

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని సంజీవపురం గ్రామంలో ముల్లగూరు సురేంద్ర నాయుడు అనే రైతు సాగు చేస్తున్న దానిమ్మ మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు.గ్రామానికి చెందిన రైతు సురేంద్ర నాయుడు తనకు గల రెండు ఎకరాల పొలంలో దాదాపు 580 దానిమ్మ మొక్కలను సాగు చేస్తున్నాడు. ఐదు నెలలుగా దానిమ్మ మొక్కలను సంరక్షించుకోగా శనివారం రాత్రి 43 మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు నరికి వేసినట్లు ఆదివారం సాయంకాలం గుర్తించినట్లు బాధితుడు సురేంద్ర నాయుడు పేర్కొన్నారు.ఈ విషయమై బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు పరిశీలించినట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని పైడేటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలంలోని విట్టపల్లికి చెందిన రవి అనే యువుకు రొద్దం మండలం మరువపల్లిలో పనిముగించుకుని ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనం ఇంటికి బయలుదేరాడు. పైడేటి సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవిని హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఎం.రవి(33) మృతిచెందాడు. ఇదిలా ఉండగా పది రోజుల్లో మండల వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఇది ఏడవ మృతి.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని యర్రాయపల్లి సమీపాన ఓబులేసుకొండలో పూలఓబయపల్లి గ్రామానికి చెందిన శెట్టిపల్లి శివారెడ్డి (43) అనే వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సోమశేఖర్, ఎఎస్ఐ సోమశేఖర్ మూర్తి తెలిపారు. తాడిమర్రి మండలం పూలఓబయ్యపల్లికి చెందిన శెట్టిపల్లి శివారెడ్డి ధర్మవరంలోని ఫర్టిలైజర్ షాపులో పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఉగాది పండుగ నుండి శివారెడ్డి కనిపించడం లేదని కుటుంబ కుటుంబ సభ్యులు ధర్మవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సోమవారం ఎర్రాయపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపర్లు కొండలో దుర్వాసన వస్తుండడంతో అటుగా వెళ్లి పరిశీలించగా వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకున్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు. శివారెడ్డి పది రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోందని ఆయన చెప్పారు.

గంజాయి విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి - బత్తలపల్లి

గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుండి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.సోమవారం బత్తలపల్లిలోని తాడిపత్రి రోడ్డు యందు జగనన్న కాలనీలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించామన్నారు. కాలనీలో బాషా అంగడి దగ్గర గంజాయి విక్రయిస్తున్న జ్వాలాపురానికి చెందిన ఉమ్మడి లోకనాథ్‌రెడ్డి, యాకిటిల వెంకటరమణలను అదుపులోకి తీసుకొని వారి వద్దనుండి రెండు చిన్న చిన్న కవర్లలో ప్యాక్ చేసి ఉన్న సుమారు 190 గ్రాముల గంజాయినీ సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం డివిజన్ పరిధిలో ప్యాదిండి గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. మరొక వ్యక్తి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందితున్నాడు. రామగిరి మండలం శ్రీహరిపురం గ్రామానికి చెందిన సాయి తేజ,(24) సోమవారం ఇంటి వద్ద నుండి ధర్మవరం పట్టణానికి ద్విచక్ర వాహనంలో వస్తూ ఉండగా, ధర్మవరం నుండి ఎన్ఎస్. గేట్ వైపు వెళ్లే ఒక కారు ప్యాదిండి గ్రామ సమీపంలో సాయి తేజ వాహనాన్ని ఢీ కొట్టింది. అలాగే అక్కడే ప్రయాణిస్తున్న రమేష్ అను వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని కూడా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సాయి తేజ అక్కడికక్కడే మృతిచెందగా రమేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయి తేజ ధర్మవరం మణప్పురం గోల్డ్ లోన్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో ఎక్సైజ్ అధికారులు సోమవారం విస్తృతదాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి 25 లీటర్ల కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నంది సర్కిల్ వద్ద మద్యం విక్రయిస్తున్న పట్టణంలోని అంబేద్కర్ నగర్ కు చెందిన మారుతీ, నారాయణ, రాజు ల మీద రెండు కేసులను నమోదు చేసి, వీరు నుంచి 25 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడులలో హెడ్ కానిస్టేబుళ్ల నరసింహ, వెంకటేష్, రమణ, సతీష్, కానిస్టేబుల్స్ అంజి సురేష్ రవీంద్ర కుమార్ రంగధామ, శివ, సుధాకర్ రెడ్డి, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని రైతుకు గాయాలు

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లేపాక్షికి చెందిన రైతు ఓబులేసు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. రైతు ఓబులేసు ద్విచక్ర వాహనంపై కుర్లపల్లికి సమీపంలో వున్న పొలానికి బయల్దేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారి నుంచి కొండూరు రోడ్డు క్రాస్ దాటే సమయంలో హిందూపురం నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి హైవే అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి హిందూపురం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

తుంగభద్ర నీటి కోసం పోరాడిన వారికి సన్మానం

ప్రజాశక్తి-పావగడ

తుంగభద్ర నీటి కోసం పోరాడిన వారిని సోమవారం పట్టణంలోని ఎస్ఎస్‌కె కమ్యూనిటీ భవన్ లో సన్మానించారు. సమీకృత జల పోరాట వేదిక అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ తాలూకాలో ఒకప్పుడు నీటి సమస్య తీవ్రంగా ఉండేదన్నారు. రాజకీయ పార్టీలు, పలు సంఘాల ఐక్య పోరాటాల ఫలితంగా నేడు తాలూకాకు తుంగభద్ర నీరు రానున్నాయ న్నారు. రానున్న రోజుల్లో తాలూకాలోని ప్రతి చెరువుకూ నీరందించేలా పోరాడేందుకు అందరి సహకారం అవసరమన్నారు. మాజీ ఎంపి జనార్ధనస్వామి మాట్లాడుతూ పావగడ తాలూకాను తాగునీటి పథకంలో చేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప, హనుమంత మహాస్వామి, రామ్మూర్తిస్వామి, మాజీ ఎమ్మెల్యే కెఎం.తిమ్మరాయప్ప, ఆర్‌సి.అంజనప్ప, సొగడు వెంకటేష్, నరసింహారెడ్డి, సూర్యనారాయణ, బాడప్ప, రామాంజనప్ప, రఘు, నాగరాజు, మహేష్, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు

ప్రజాశక్తి - నల్లచెరువు

నల్లచెరువు మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్య రోజురోజుకు అధికమవుతోంది. నీరు రాక ఆయా కాలనీల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మోటర్ మరమ్మతులు, పైపులైను లీకేజీలు ఇలా పలు సమస్యలతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని వాపోతున్నారు. పది రోజులైనా నీరు రాక ట్యాంకర్ ద్వారా నీటిని తెప్పించుకుంటున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కదిరిలో జరిగిన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆపాఠశాల ప్రిన్సిపల్ రమేష్ బాబు తెలిపారు. విద్యార్థులు లేఖన, ఓం శ్రీ, పరహన త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారన్నారు.వీరి ఎంపిక పట్ల ప్రిన్సిపల్ రమేష్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ అజీమ్‌బాషా హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని వారు ఆకాంక్షించారు.

గ్రాడ్యుయేషన్ డే

ముదిగుబ్బ : స్థానిక పివిఎస్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. యువ సాధకులు తమ టోపీలు మరియు గౌనులు ధరించి ఉత్సాహంగా కన్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పీవీఎస్ నాయుడు, ఏడీ మనీషా, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.